ఆర్మూర్-మంచిర్యాల రహదారికి లైన్ క్లియర్

- త్వరలో టెండర్ల ప్రక్రియ: ఎన్‌హెచ్ఏఐ
- 143 కిలోమీటర్ల పాడవున భూసేకరణ

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఆర్మూర్ నుంచి మంచిర్యాల మధ్య నాలుగు లేన్ల గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి త్వరలో టెండర్ల ప్రక్రియకు జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్ఏఐ) సన్నాహాలు చేస్తున్నది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు ఆమోదం తెలపడంతో రహదారి నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభించింది. సుమారు 143 కిలోమీటర్ల పొడవున భూసేకరణ చేయాల్సి ఉన్నది. జాతీయ రహదారి-63లో భాగంగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి గతంలోనే కేంద్ర ప్రభుత్వం రూ.3000 కోట్లు మంజూరు చేసింది. ఈ రహదారి నిర్మాణం కోసం భారీగా భూసేకరణ చేపట్టాల్సి రావడం, రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో గత కేసీఆర్ ప్రభుత్వం దీనిపై అచితూచి వ్యవహరించింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సంసిద్ధత వ్యక్తంచేస్తూ ఎన్‌హెచ్ఏఐకి హామీ ఇచ్చింది. వారు టెండర్ల ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్మూర్ నుంచి మంచిర్యాల, క్యాతన్‌పల్లి, వేంపల్లి శివార్ల నుంచి రంగంపేట, ఆర్ఆర్ నగర్, అమ్మ గార్డెన్స్, ఎంఎన్ఆర్ గార్డెన్స్ ఏరియా, గద్దెరాగడి తదితర ప్రాంతాలమీదుగా ఈ రహదారిని నిర్మించనున్నారు. ఆర్మూర్ నుంచి మంచిర్యాల మధ్య మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి, లక్సెట్టిపేట తదితర పట్టణాలు కూడా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణలో భారీగా ఇండ్లకు నష్టం జరిగే అవకాశం ఉన్నందున పట్టణాల వెంబడి పొలాల నుంచి బైపాస్‌ను నిర్మించాలని నిశ్చయించారు. జగిత్యాలలో అత్యధికంగా 70 కిలోమీటర్ల మేర, మంచిర్యాల జిల్లాలో దాదాపు 40 కిలోమీటర్లు, నిజామాబాద్‌లో 30 కిలోమీటర్ల వరకు రహదారిని విస్తరించాల్సి ఉన్నది. ఇప్పటికే కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతంలో వరద కాలువ, రైల్వేలైను కోసం రైతులు భూములను కోల్పోగా, తాజాగా నాలుగు లేన్ల రహదారి కోసం కూడా భూములను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్వదేశానికి తిరిగొస్తూ జైలు పాలు

- కొంపముంచిన మానవత్వం
- ఫ్లైట్‌లో చలికి వణుకుతున్న చిన్నారులకు దుప్పటి కప్పిన జగిత్యాల వాసి
- అసభ్యకరంగా ప్రవర్తించాడని అంటూ కన్నతల్లి ఫిర్యాదు
- కొలంబోలో కటకటాల్లోకి..
- ప్రభుత్వం చొరవ చూపాలని కుటుంబ సభ్యుల వేడుకోలు

కుటుంబ సభ్యులతో శంకరయ్య

జగిత్యాల రూరల్, జనవరి 6: ఉపాధి కోసం పరాయి దేశం వెళ్లి తిరిగి స్వదేశానికి వస్తున్న ఓ వ్యక్తి చూపిన మానవత్వం అతడినే జైలుపాలు చేసింది. జగిత్యాల జిల్లా రూరల్ మండలం పొలాసకు చెందిన బద్దెన పల్లి శంకరయ్య ఉపాధి నిమిత్తం 14 ఏండ్లుగా సౌదీ అరేబియాకు వెళ్లొస్తున్నాడు. అక్కడ మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శంకరయ్యకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య బీడీలు చుట్టడంతో పాటు కూలీ పనులు చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటున్నది. శంకరయ్య గత ఏప్రిల్‌లోనే స్వదేశానికి వచ్చి వెళ్లాడు. ఇక స్వగ్రామంలోనే ఉండాలని నిర్ణయించుకొని అక్కడి కంపెనీతో అన్నీ సెటిల్ చేసుకున్నాడు. గత నెల 12న స్వదేశానికి బయలుదేరాడు. అయితే విమానంలో తన సీటు పక్కన సీటులో ఇద్దరు చిన్నారులతో కలిసి ఓ శ్రీలంక మహిళ ప్రయాణం చేసింది. చలితో ఆ చిన్నారులు వణుకుతుండటంతో వారికి శంకరయ్య దుప్పటి కప్పే ప్రయత్నం చేశాడు. దీంతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని విమాన సిబ్బందికి చిన్నారి తల్లి ఫిర్యాదు చేసింది. కొలంబోలో విమానం ఆగిన వెంటనే శంకరయ్యను శ్రీలంక పోలీసులు అదుపులోకి తీసుకుని జైలుకు పంపించారు. న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా జమానత్ ఇచ్చేవారు లేకపోవడంతో శంకరయ్య శ్రీలంకలోనే ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకొని తన భర్తను ఇంటికి రప్పించాలని భార్య గంగలక్ష్మి కోరుతున్నది.

రూ.3.16 కోట్లకు టోకరా

- స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట మోసం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇప్పిస్తానంటూ అమాయకులను నమ్మించి రూ.కోట్లు దండుకుంటున్న ఘరానా నేరస్థుడు రోనక్ తన్న (35)ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గోవాకు చెందిన నిందితుడి నుంచి 2 ల్యాప్‌టాప్‌లు, 6 సెల్‌ఫోన్లు, 6 సిమ్‌కార్డులు, 5 చెక్‌బుక్‌లు, 15 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకోవడంతోపాటు అతడి బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.20 లక్షలు ఫ్రీజ్ చేసినట్టు నగర పోలీసు కమిషనర్ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. రోనక్ మాయమాటలను నమ్మి రూ.3.16 కోట్లు మోసపోయినట్టు హైదరాబాద్ మహిళ ఫిర్యాదు చేయడంతో అతడిని అరెస్టు చేసినట్టు తెలిపారు. రోనక్‌కు సహకరించిన సుదిత్ గోన్సాల్వెస్, సనా మహ్మద్ ఖురేషీకి నోటీసులు జారీచేసినట్టు చెప్పారు.

ఏప్రిల్ 1న స్పోర్ట్స్ క్యాడెట్ల ర్యాలీ

- కనీస విద్యార్హత 3వ తరగతి ఉత్తీర్ణత
- 8 నుంచి 14 ఏండ్లలోపు బాలురకు ఆర్మీ పిలుపు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీలో స్పోర్ట్స్ క్యాడెట్ల కోసం ఏప్రిల్ 1 నుంచి 7 వరకు ఇండక్షన్ ర్యాలీ నిర్వహించనున్నట్టు డిఫెన్స్ ఉన్నతాధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 ఈఎంఈ సికింద్రాబాద్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఓపెన్ ర్యాలీ వాలీబాల్, కయాకింగ్, కెనోయింగ్ విభాగాల్లో ఉంటుందని పేర్కొన్నారు. దీనికి 8 నుంచి 14 ఏండ్ల వయసున్న విద్యార్థులు అర్హులని, 3వ తరగతి ఉత్తీర్ణత కనీస విద్యార్హత అని, ఇంగ్లిష్, హిందీలో పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. దరఖాస్తుదారుల ఫిట్‌నెస్‌ను ప్రత్యేక వైద్యాధికారులు నిర్ధారిస్తారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థి శరీరంపై ఎక్కడైనా టాటూలు ఉంటే అనర్హులని, అటువంటివారు దరఖాస్తు చేసుకోవద్దని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్పోర్ట్స్ క్యాడెట్లుగా పిలుస్తారని, 10వ తరగతి వరకు ఉచిత బోర్డింగ్, లాడ్జింగ్, విద్య, బీమా, వైద్య సదుపాయం, సైంటిఫిక్ కోచింగ్ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆర్మీ నిబంధనల ప్రకారం అర్హులైన స్పోర్ట్స్ క్యాడెట్లను ఇండియన్ ఆర్మీలోకి తీసుకుంటారని తెలిపారు. వివరాలకు 9398543351 (వాట్సాప్) bsc1emecentre@gmail.com మెయిల్‌లో సంప్రదించాలని కోరారు.

ఎంపీ రఘురామకు ఊరట

- ఫెమా కేసులో జరిమానా విధింపుపై హైకోర్టు స్టే

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ఫెమా నిబంధనల ఉల్లంఘన కేసులో ఆంధ్రప్రదేశ్ ఎంపీ కే రఘురామ కృష్ణంరాజుకు తెలింగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు రూ.40 కోట్ల జరిమానా విధిస్తూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీచేసిన ప్రొసీడింగ్స్ అమలును 6 వారాలపాటు నిలిపివేస్తున్నట్టు జస్టిస్ సూరేపల్లి నందా ప్రకటించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు వాయిదా వేస్తున్నట్టు తెలిపారు.

రెండు పులుల ఘర్షణ

- ఆడ పులి మృత్యువాత
- దరిగాం అటవీ ప్రాంతంలో ఆలస్యంగా వెలుగులోకి

కుమ్రంభీం ఆసిఫాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో ఓ పులి మృత్యువాతపడింది. ఈ ఘటన శనివారం వెలుగుచూసింది. పులి కళేబరంపై ఉన్న గాయాల ఆధారంగా ఇటీవల ఆడ, మగ పులుల మధ్య జరిగిన ఘర్షణలో ఆడ పులి చనిపోయి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అటవీ అధికారులు ఈ విషయాన్ని శనివారం గుర్తించారు. పులి మృతిపై అధికారులు విచారణ చేపడుతున్నారు. కాగా గత నెల 12న ఇదే అటవీ ప్రాంతంలో పశువుల కాపరిపై పులి దాడి చేసిన విషయం తెలిసిందే.

ఫోన్లు అతిగా వాడొద్దని బాండ్ రాయించుకుంది

- కుటుంబంతో ముంబై మహిళ ఒప్పందం

ముంబై, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం ఏ కుటుంబంలో చూసినా అందరూ మొబైల్ ఫోన్‌లో గంటల పాటు గడిపేస్తున్నారు. అయితే, అవసరాలకు మించి ఫోన్‌ను అతిగా వాడుతూ చిన్నా, పెద్దా అందరూ సమయాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే వాస్తవాన్ని గుర్తించింది ముంబైకి చెందిన మంజుగుప్తా అనే మహిళ. ఇంట్లో అందరూ ఒకే చోట ఉన్నా.. ఒకరితో మరొకరు మాట్లాడుకోకుండా ఫోన్లలో తల పెట్టుకుని కూర్చొంటున్న సమస్యకు పరిష్కారం చూపాలనుకొన్నది. ఈ మేరకు కుటుంబసభ్యులతో ఒప్పందం చేసుకొని బాండ్ రాయించుకొన్నది. ఇంట్లో ఫోన్ అధిక వాడకంపై షరతులు విధించింది. ఈ మేరకు 50 రూపాయల బాండ్‌పేపర్‌పై కొన్ని షరతులు టైప్ చేయించి వారితో సంతకాలు చేయించింది. ఈ బాండ్ పేపర్‌ను మంజుగుప్తా మేనకోడలు సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది.

బాండ్ పేపర్‌లోని షరతులు..

1) అందరూ నిద్ర లేవగానే మొబైల్ చూడకుండా నేరుగా సూర్య దర్శనానికి వెళ్లాలి.
2) అందరూ కలిసి డైనింగ్ టేబుల్ వద్ద భోజనం చేయాలి.
3) అన్నం తినేటప్పుడు ఫోన్‌లను తప్పనిసరిగా దూరంగా ఉంచాలి.
4) వాష్‌రూమ్‌కు వెళ్లేటప్పుడు ఎవరూ ఫోన్‌ను వెంట తీసుకెళ్లకూడదు.
5 ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే.. శిక్షగా ఆ సభ్యునికి జొమాటో, స్విగ్గీ యాక్సెస్ తీసివేయబడుతుంది.




సంక్రాంతి శుభాకాంక్షలతో...
ఈనెల 14న బ్రహ్మాండమైన విడుదల
SRINIVASAA SILVER SCREEN
PAVAN KUMAR PRESENTS
నా సామిరంగ
SRINIVASAA CHITTURI
VIJAY BINNI
MM KEERAVAANI
Junglee
ధీర 70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
అర్జున్ 70 ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి
మెగా 70 ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్
ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
మీరజ్ సినిమాస్ - బిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ ఆర్.కె - బంజారాహిల్స్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
పివిఆర్ పెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
మీరజ్ సినిమాస్ - చందానగర్
పివిఆర్ ఇనిఆర్బిట్‌మాల్ - మాదాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
పివిఆర్ నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
లక్ష్మీనరసింహా - మియాపూర్
పివిఆర్ గలేరియా - పంజాగుట్ట
ఎఎంఆర్ - మౌలాలి
పివిఆర్ పివిఆర్ ఎ/సి - ఎర్రమంజిల్
ప్లాటినమ్ - అమీర్‌పేట్
పివిఆర్ పివిఆర్ ఎ/సి - మూసారంబాగ్
ఎంక్యూబ్ - అత్తాపూర్
పివిఆర్ ప్రెస్టన్ ప్లైమ్ - గచ్చిబౌలి
సినీ ప్లానెట్ - ఉప్పల్
పివిఆర్ ఐకాన్ - హైటెక్ సిటీ
ఎం.జె.ఆర్ - నారపల్లి
పివిఆర్ ATRIUM మాల్ -గచ్చిబౌలి
జిపిఆర్ - కూకట్‌పల్లి
పివిఆర్ ఎఫ్2 ఎ/సి - మల్లాపూర్
ఏషియన్ రాధిక - కాప్రా
సినీ ప్లానెట్ ఎ/సి - కొంపల్లి
లులు మాల్ - కూకట్‌పల్లి
CCPL - మల్కాజ్‌గిరి
ఎఎంబి ఎ/సి - గచ్చిబౌలి
డి.ఎల్.ఎఫ్ - ఉప్పల్
ఎఎఎ ఎ/సి - అమీర్‌పేట్
మంత్రామాల్ - అత్తాపూర్